నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. చిక్కడపల్లి, ఆలిండియా రేడియో, గాంధీభవన్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, గాంధీకుటీర్, మారుతి నగర్, ఐఓఈ, ఓల్డ్‌ఎమ్మెల్యే క్వార్టర్స్ పరిధుల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు, కేశవ్ మెమోరియల్ పరిధిలో 3.30నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



ర్యాలీలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

నేడు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీచౌరస్తా వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్, రజక వృత్తిదారక సంఘం, దివ్యాంగుల హక్కుల వేదిక, హైదరాబాద్ సిటిజన్ ఫోరం నాయకులు పాల్గొన్నారు.

16న బ్యాండ్, వాయిద్య కళాకారుల సంఘం సదస్సు

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బ్యాండ్, వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఈ నెల 16న జరిగే బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. వృత్తి సంఘాల కన్వీనర్ ఎంవీ.రమణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.రవీందర్, కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'శాశ్వత షెడ్ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం'

కవాడిగూడ. జూలై 8 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కోసం శాశ్వత షెడ్లు నిర్మించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం అధ్యక్షుడు టి.రవీందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రస్తుత బోనాల సందర్భంగా కనీసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని, ఆ తర్వాత శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని ఆయన దేవాదాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసే స్థలాన్ని రవీందర్, భక్తులు, బీజేపీ నేతలు పరిశీలించారు. ఈ స్థలంలో ఓ ప్రైవేట్‌కంపెనీ వాహనాల కోసం ఇచ్చిన పార్కింగ్‌ను రద్దు చేసి, శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

'ఆ పోస్టులను మాకే కేటాయించాలి'

కవాడిగూడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ ఎస్‌బీఐ కాలనీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులను ఎస్‌బీఐ కాలనీ సొసైటీ సభ్యులతో భర్తీచేయాలని ఎస్‌బీఐ స్టాఫ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు, ఎస్‌బీఐ కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు డిమాండ్ చేశారు. గుడిని స్వాధీనం చేసుకునేందుకు కొంతమంది బయటి వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం కవాడిగూడ తాళ్లబస్తీలోని షిరిడీ సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌బీఐ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ కె.చంద్రశేఖర్, సలహాదారులు టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎ.సరళ, ఎ.శంకర్‌గౌడ్, కోశాధికారి కె.లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ ఉమానాథ్‌శర్మ, కార్యవర్గసభ్యులు శ్రీనివాస్, టి.రమ, సుందరి మాట్లాడారు. సొసైటీకి సమాచారం లేకుండా వారు ఆలయంలో పలు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

'జీవో 282ను రద్దు చేయాలి'

చిక్కడపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988లోని సెక్షన్ 16, 17లను సవరిస్తూ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో 282ను వెంటనే రద్దుచేయాలని తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా.ఇ.గంగాధర్‌కు మంగళారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు ఎస్.బాల్‌రాజ్, పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రెబ్బ రామారావు, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే. బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ దశరథ్ మాట్లాడారు. కేంద్రం అమల్లోకి తేదల్చుకున్న లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలుకు మార్గం సుగమం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీవోను తెచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌టీ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ వాటర్‌బోర్డు డీజీఎం, కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మంచినీటి లోప్రెషర్, కలుషిత తాగునీటి సరఫరాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ మేరకు స్థానికులు కార్పొరేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వెంటనే లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు ఆనంద్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, భరత్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, ఎస్ఆర్‌టి కాలనీ నాయకులు డేవిడ్, ప్రశాంత్, నర్సింగ్‌రావు, యాదయ్య, శివ, శ్రీధర్, సంజీవ్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సమగ్ర సాంస్కృతిక విధానం లేకుండా తెలంగాణ అభివృద్ధి ఎలా సాధ్యం?

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సాంస్కృతిక విధానం లేకుండా తెలంగాణ అభివృద్ధి ఎలా సాధ్యం అని జస్టిస్ బి.చంద్రకుమార్ ప్రశ్నించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక విధానంపై తెలంగాణ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై విష సంస్కృతి విలయ తాండవం చేస్తుందని, దీనికి పిల్లల నుంచి పెద్దల వరకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. కాషాయం, కార్పొరేట్ కలిసిపోతున్నాయని పేర్కొన్నారు. మానవీయ విలువలను బోధించేందుకు కళాకారులను ప్రభుత్వం వాడుకోవాలని సూచించారు. జానపద అకాడమి, బాల సాహిత్య అకాడమి, సంగీత నృత్య, లలిత కళల అకాడమి, ఫొటోగ్రఫీ చిత్ర కళాల అకాడమి తక్షణమే ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియించాలని సూచించారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువల గురించి భావితరాలకు కళాయాత్రల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ రాష్ట్రకార్యదర్శి ఎండీ.అబ్బాస్, జి.రాములు, సాంబరాజు యాదగిరి, మూర్తి, బుచ్చిరెడ్డి, మహేష్, ఆయోధ్య రామయ్య పాల్గొన్నారు.

రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాల చోరీ

బర్కత్‌పుర, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాలప్రకారం... బర్కత్‌పురలో నివాసం ఉంటున్న మాన్వీవ్యాస్(22) కుటుంబ సభ్యులతో కలిసి భగత్‌కోట్‌కు వెళ్లారు. తిరుగుప్రయాణంలో భగత్‌కోట్ - కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. మహారాష్ట్రలోని మోత్కేర్ రైల్వే స్టేషన్ సమీపంలో మాన్వీవ్యాస్ బంధువురాల బ్యాగును దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో 10 గ్రాముల బంగారు రింగు, 20 గ్రాముల బంగారు చెయిన్, రూ.5 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఉన్నాయి. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, తదుపరి విచారణ కోసం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీచేసినట్లు సీఐ తెలిపారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ అశోకా నగర్‌లో నూతనంగా రూ.34లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు బస్తీలో పర్యటించి ప్రజలను కలుసుకుని వారితో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో, గ్రేటర్‌లో అగ్రభాగాన నిలపడమే లక్ష్యంతో పనిచేస్తున్నానని అన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయాల వద్ద అన్ని అభివృద్ధి పనులను చేపడుతున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సబిత, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మనోహర్, జలమండలి ఏఈ రోహిత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎ.సురేష్‌గౌడ్, ఎన్.లింగంయాదవ్, పడకంటి అంజయ్యచారి, పి.శ్రీనివాస్, పి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అశోకానగర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్

బోనాల పండగకు ఏర్పాట్లు

- అంబర్‌పేట నియోజకవర్గంలో 139 అమ్మవారి దేవాలయాలకు రూ.55.29 లక్షల చెక్కుల పంపిణీ
- నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వీహెచ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తదితరులు

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రారంభమైన ఆషాఢమాసం బోనాల పండగ సందర్భంగా ఆలయాల వద్ద మౌలిక వసతులు కల్పించి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో జరిగే బోనాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం బోనాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, దూసరి లావణ్యగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, యాకర అమృత, కన్నె ఉమాదేవి, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు త దితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు నగరప్రజలపై ఉండాలన్నారు. ఈనెల 13న సికింద్రాబాద్ ఉజ్జయిని అమ్మవారి బోనాలు, 20వ తేదీన లాల్‌దర్వాజ బోనాలు జరుగుతున్నాయని తెలిపారు. జంటనగరాల్లో 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని, ఇప్పటికే చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఆలయంలో జరిగే బోనాల ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 139 అమ్మవారి దేవాలయాలకు రూ.55.29 లక్షల చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట మహంకాళి ఆలయ అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, సలహాదారులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధానకార్యదర్శి మల్లికార్జున్‌గౌడ్, కార్యనిర్వహక కార్యదర్శి కిషోర్, అధికారులు ఆర్డీవో రామకృష్ణ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ జోగుల నర్సయ్య, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డీఎంసీ మారుతిదివాకర్, ఎంహెచ్‌వో హేమలత, తహసల్దార్ అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును మంగళవారం సత్కరిస్తున్న పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, వై.దామోదర్‌నాయుడు, రాంచందర్, మహ్మద్ సలీమ్, కర్రీ రవీందర్, బి.ఈశ్వర్‌రావు, కె.కృష్ణ, టి.శ్రీరామ్, మోహన్ తదితరులు - (గోల్నాక, జూలై 8 ఆంధ్రజ్యోతి)

జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మామిడాల నర్సింహ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కారోబార్, బిల్‌కలెక్టర్లను జీవో 51 నుంచి మినహాయింపు చేయాలన్నారు. వారందరికీ ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధానకార్యదర్శి ఆర్.కె.నాయుడు, కోశాధికారి సాదుల శ్రీకాంత్, నాయకులు మురళీ, ఓరుగంటి రఘు, వంగ రవీందర్, సదానందం, పద్మారావు, బొల్లం శ్రీనివాస్, మల్లాచారి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ మందులు అమ్ముతున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ కంపెనీల పేరిట నకిలీ మందులు అమ్ముతున్న మెడికల్‌షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫార్మా సీ అండ్ ఎఫ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అడిక్‌మెట్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా మెడికల్ షాపుల యజమానులు అధిక లాభాలకు కక్కుర్తి పడి నకిలీ మందులు అమ్ముతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు చేస్తూ నకిలీ మందులు అమ్మే షాపులను సీజ్ చేయాలని కోరారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

గోల్నాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం ఆవరణలోని దుర్గమ్మ దేవాలయంలో మంగళవారం బోనాల పండుగ సంబరాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, ఎస్ఎస్.తిరుపతినాయక్, అధికారులు, పారిశుధ్యకార్మికులు పాల్గొన్నారు. కార్పొరేటర్, డీఎంసీ, ఏఎంహెచ్ఓను సత్కరించారు.



ఎమ్మెల్యే గోపాల్‌ను సన్మానిస్తున్న అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

దేవాలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గాంధీనగర్ డివిజన సిద్దంశెట్టి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న బంగారు పోచమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మంగళవారం అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. బోనాల పండుగకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం పలికారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముఠా నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జితేందర్, సంయుక్త కార్యదర్శి పద్మ, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజ్ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించాలి

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిత్యం వేలాది వివాహాలను కుదిరిస్తున్న మ్యారేజ్ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం, సావనీర్ ఆవిష్కరణ, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మ్యారేజీ బ్యూరోల నిర్వాహకులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అసోసియేషన్ ముఖ్య సలహాదారు ఈశ్వర్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శ్యామ్‌రావు ముదిరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సభ్యులు ఎం.మదన్‌మోహన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

- రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



చాదర్‌ఘాట్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి, గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ సందర్శించి, అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజు, లక్ష్మి పాల్గొన్నారు. - (గోల్నాక)

ఆటోడ్రైవర్ల హామీల అమలులో విఫలం

ఆగస్టులో ఆటోడ్రైవర్ల బహిరంగ సభ: జేఏసీ



మాట్లాడుతున్న తెలంగాణ ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే.దస్తగిరి తదితరులు

నల్లకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే.దస్తగిరి ఆరోపించారు. ముఖ్యంగా ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. వేలాది మంది ఆటోడ్రైవర్లు, కార్మికులతో రాజకీయ పార్టీలకతీతంగా ఆగస్టు నెలలో మంచిర్యాలలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటోడ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి కాకుండా నెలకు రూ.12 వేలు ఆర్థిక సహాయం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్లు మంజూరు, ఇంధన చార్జీల పెంపుకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణా యాప్ ఏర్పాటు వంటి తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో జేఏసీ నాయకులు ఎం.డి.సాదిక్, హిమాంసాబ్, రాజు నాయక్, జార్జ్, ఆకాష్, రఫీ, సాయి, కార్తీక్, రవికుమార్, అతిష్, అనిల్, ఎం.డి.వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేస్తాం : డీఎంసీ

ముషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్‌లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకోకుండా వ్యాపారం చేసేవారి దుకాణాలను సీజ్‌చేస్తామని జీహెచ్ఎంసీ డీఎంసీ రామానుజుల రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ముషీరాబాద్‌లో జీహెచ్ఎంసీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్తి పన్ను చెల్లించని వారి దుకాణాలను సీజ్ చేశారు. కొంతమంది అధికారుల విజ్ఞప్తి మేరకు బకాయిలను చెల్లించారు. ఈ సందర్భంగా రామానుజుల రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటికే మొండిబకాయిదారులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. రెండేళ్లుగా ట్యాక్స్ చెల్లించకుండా వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారిని గుర్తించి, ఆ సంస్థను సీజ్ చేసేందుకు యత్నించారు. దీంతో రూ.3.64లను చెల్లించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రవీణ చంద్ర, బిల్ కలెక్టర్‌లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో బడిబాటకు విశేష స్పందన

డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్



ముషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 1, 2 శాఖలలో ఈ విద్యా సంవత్సరం బడిబాటకు విశేష స్పందన లభించిందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలం 1 పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గత ఏడాది 977 మంది విద్యార్థులు చేరగా ఈ విద్యా సంవత్సరం 1,045మంది విద్యార్థులు ప్రవేశం పొందారని తెలిపారు. మండలం 2 పరిధిలో గత ఏడాది 2,823 మంది విద్యార్థులు చేరగా ఈ విద్యా సంవత్సరం 3,013మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయిలో విద్య అందించడంతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నేటి విద్యా విధానానికి అనుకూలంగా ఏఐ, కంప్యూటర్ క్లాసులు సైతం తీసుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలి : కార్పొరేటర్

నల్లకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కష్టపడి, ఏకాగ్రతతో విద్యార్థులు చదువుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీగురుదత్త స్కూల్‌లో నేటి సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట పీఎస్ ఎస్ఐ వరలక్ష్మి, శ్రీగురుదత్త స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ, బీజేపీ హైదరాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, నాయకుడు కేజే.బాబ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణం

బర్కత్‌పుర, జూలై 8(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్‌లు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆరేళ్ల అంజయ్య, బీజేపీ నాయకులు వాసు, ఓంప్రకాష్, కృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా దెబ్బతీసేందుకే అక్రమ కేసులు : బీఆర్ఎస్

ముషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకూ బీఆర్ఎస్ మరింత బలపడుతుండడం చూసి సీఎం రేవంత్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని, అందుకే బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆరోపించారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన సందర్భంగా జైసింహ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్, భోలక్‌పూర్, అడిక్‌మెట్, గాంధీనగర్ డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, వల్లాల శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణబాబు, వంగాల నర్సింగరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ నగర అధ్యక్షుడు సురేష్, మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి

ముషీరాబాద్‌లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

రాంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పటిష్టమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ సేవాదళ్ నగర అధ్యక్షుడు కరణం సురేష్ పేర్కొన్నారు. మంగళవారం రాంనగర్ గుండూ చౌరస్తాలో సేవాదళ్ ఆధ్వర్యంలో దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రావి వెంకటరెడ్డి, నాయకులు వరదరాజు, విజయ్‌కుమార్‌యాదవ్, కిరణ్, ఆనంద్ ముదిరాజ్, మధు, విజయకుమార్, వల్లభ్‌రెడ్డి, లింగాల శ్రీకాంత్‌గౌడ్, రమేష్, సతీష్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళి



- ఉమ్మడి ఏపీ మాజీ సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నల్లకుంటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీపీసీసీ ఓబీసీసెల్ వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.ప్రభుదాస్, రమేష్, ఉమారాణి పాల్గొన్నారు.
- ఏపీ మాజీ సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ఆయన విగ్రహానికి నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.లక్ష్మణ్, సీనియర్ నాయకుడు కె.శ్రీకాంత్, ఇ.ప్రవీణ్, కె.సాయిరామ్ నివాళులర్పించారు.



\- నల్లకుంట, ఆంధ్రజ్యోతి